# అమెరికాలో దేవుడు

"ఏదో నీ పేరు చెప్పుకుని ఈ వయసులో అమెరికాయాత్రకి వచ్చాను తల్లీ! నాకు ఇక్కడున్న పవిత్ర స్థలాలు నాలుగూ చూపిస్తే, ఇంత కష్టపడి చేసిన నా ప్రయాణానికి ఫలితం దక్కుతుంది" అన్నారు బామ్మగారు, బాపూ బొమ్మ లాటి భామతో.

"అదేమిటి బామ్మా! అమెరికావచ్చి డిస్నీలాండూ, నయాగరా, న్యూయార్కూ చూద్దామనుకుంటారు, నువ్వేమిటే అమెరికాకి తీర్థయాత్రకి వచ్చానంటావ్" అంది భామ ఆవిడని కవ్విస్తూ.

ఆవిడ భామని అదోలా చూసి నవ్వి "నీముఖం. నన్నేదో ఆటపట్టిస్తున్నావ్‌కానీ, ఆ ఇంగ్లీష్ పేర్లే నాకర్థం కావు. ఇంకా అవి చూసేదేమిటి చెప్పు. మీ వూళ్ళో వెంకటేశ్వరస్వామి గుడీ, ఆంజనేయులవారి దేవాలయం వున్నాయా?" అడిగారు.

ఆవిడ మాటలకి భామ నవ్వబోతుంటే గోపాలం కళ్ళతో ఆ నవ్వుకి ఆనకట్ట వేసి బామ్మగారితో "మీ బామ్మ సంగతి పట్టించుకోకండి భామగారూ సారీ! మీ భామ సంగతి పట్టించుకోకండి బామ్మగారూ. నేను చూపిస్తా కదా అమెరికాలో గుడులన్నీ...." అన్నాడు.

భామ పకపకా నవ్వి "సరిగ్గా మాట్లాడటం కూడా రాని మా ఆయన సలే నాస్తికుడు. నీకు అమెరికాలో గుడులన్నీ చూపిస్తాడుట..." అంది

ఏమిటే మర్యాద లేకుండా ఆ ఏకవచన ప్రయోగం" అన్నారు బామ్మగారు, నవ్వాపి తన బోసి నోట్లోనే దాచేసుకుని.

"అలా నాలుగూ పెట్టండి బామ్మగారూ రేపు శనివారం కదా! ప్రొద్దున్నే బయల్దేరి మా వూరి గుడికి వెడదాం.."

"ఇంతకీ మీ గుడి ఏ దేముడి గుడి?" అడిగారు బామ్మగారు.

"అమెరికాలో దేవుళ్ళకి వేరే వేరే గుళ్ళుండవు బామ్మగారూ. ఉదాహరణకి మావూళ్ళో ఒకే గుడి వుంది. అది తెలుగువాళ్ళే మొదలుపెట్టారు. తెలుగువాళ్ళకి ప్రియమైన దేముడు వెంకటేశ్వరస్వామి కనుక, ఆయనకే దేవాలయం కట్టాలనుకున్నారు. గుడి కట్టటమంటే మాటలా. చాల డబ్బులు కావాలి, స్థలానికే 300 వేల డాలర్లు, అంటే మూడు లక్షల డాలర్లు కావాలి. మామూలుగా గుడి కట్టటానికి 8-10 లక్షల డాలర్లవుతుంది. ఇది మావూరి స్థలాల మార్కెట్, కట్టడాల రేట్లనిబట్టి చెబుతున్నాను. అయినా సరే పదండి ముందుకి అని ఓ పది మంది ముందుకి వచ్చారు. కొద్దిమంది తెలుగువాళ్ళు, కొద్దిమంది అరవవాళ్ళు మాత్రం గట్టిగా పట్టుదలలో పనిచేశారు. మావూరి మన జనాభాలో చాలమందికి వరాలిచ్చే దేవుడి మీద భక్తో భయమో అయితే వున్నది కానీ, ఆ దేవుడి కోసం వరహాలిచ్చే ఉద్దేశ్యం మాత్రం లేదని అప్పుడర్థమయింది. అందుకని ముందుకు పోవటమెలా అని ఆలోచించగా అసలు కీలకం అర్థమయిపోయింది. హిందూ గుడి అని పేరు పెట్టి ఆ గుళ్ళో ఉత్తరాదివారికి రాధాకృష్ణుల విగ్రహాల్ని, తెలుగువారికి వెంకన్ననీ, తమిళుల కోసం మధుర మీనాక్షినీ, మలయాళీలకి అయ్యప్పనీ, శైవుల కోసం శివపార్వతులనీ, వైష్ణవుల కోసం లక్ష్మీ విష్ణుమూర్తి గారిని, పిల్లల చదువుల కోసం వినాయకుడినీ ప్రతిష్ఠించారు. అందరిలోకీ బాగా డబ్బులు ఇచ్చిన భద్రాచలం రామారావు తృప్తి కోసం సీతారామలక్షణ ఆంజనేయుల వారినీ, బెంగాలీబాబు అశోక్ బెనర్జీ ఆనందంకోసం కాళీమాతనీ (ఆ మాట విని బెజవాడ దుర్గారావు డబ్బులెక్కువిచ్చారని ఒక గాలి కబురు) అక్కడ ప్రతిష్ఠించారు. దానితో ఈ గుడి మా వూళ్ళోని పెద్దలందరికీ ప్రీతిపాత్రమయింది. అక్కడికే రేపు వెడదాం"

భామ బోలెడు ఆశ్చర్యపోయి "ఏమిటీ! మీరు గుడికి వస్తారా?" అని అడిగింది.

"ఏం ఎందుకు రాకూడదూ! బామ్మగారి కోసం ఏమైనా చేస్తాను" అన్నాడు గోపాలం నవ్వుతూ.

మర్నాడు గుడిని బయటనించీ చూడగానే "ఎంత బాగుందే! అచ్చం మన వేపులాగానే గోపురం. ధ్వజస్థంభం." అని మెచ్చుకున్నారు బామ్మగారు.

"అవును. తిరపతినించీ, మధురనించీ శిల్పులని తెప్పించి కట్టించారిది" చెప్పాడు గోపాలం.

"ని పేరుతో అష్టోత్తరం చేయిస్తానుండు" అని భామ అక్కడ బల్ల దగ్గరికి వెళ్ళి చెక్కు యిచ్చి, టిక్కెట్టు కొనుక్కు వచ్చింది.

లోపల ఒక తెలుగు పూజారిగారు, ఒక మలయాళం పూజారిగారు వున్నారు. భామని చూసి తెలుగు పూజారిగారు, "రండి. రండి. బామ్మగారి పేరుతో పూజ చేయమంటారా?" అని గోపాలాన్ని చూసి, "అరె గోపాలంగారు కూడా వచ్చారే! అంటే ఇవాళ మంచిరోజు. శుభం" అని పూజ శాస్త్రోక్తంగా చేసి, బామ్మగారిని ఆశ్చర్యపరిచారు.

"ఎంత బాగా చేశారు ఆయన. అచ్చం మనవైపు లాగానే" అన్నారు బామ్మగారు.

"మరి ఆయన మనవేపు ఆయనే కదా అందుకని. ఆయనది గుంటూరు. ఆనంద తీర అగ్రహారం" అంది భామ నవ్వి.

కొంచెం పక్కనే ఆంజనేయులుగారు పిల్లలకి ఇంగ్లీషులో హిందూ మతం గురించి చెబుతున్నారు. ఆయన అక్కడే హాస్పిటల్లో పెద్ద పేరు మోసిన గుండెల మార్పిడి డాక్టర్. పిల్లలు అడుగుతున్న తెలివైన ప్రశ్నలకి ఆయన చాల ఓపిగ్గా జవాబులు చెబుతున్నాడు.

తనకి తెలియని విషయాలమీద ప్రశ్న లడిగితే, "మనమందరం ఇంటర్నెట్లోనూ పుస్తకాల్లోనూ రీశెర్చిచేద్దాం. వచ్చేవారం మళ్ళీ కలిసినప్పుడు, ఎవరి జవాబులు సమంజసంగా వుంటాయో చూద్దాం!" అని చెబుతున్నాడు.

"హాయ్ భామగారూ. నమస్కారం బామ్మగారూ. అరె! ఇదేమిటి నువ్వుకూడా వచ్చావ్. ఇవాళ మన వూరికే చాల మంచి రోజు. శుభం. రండి. ప్రసాదం తిందాం" అన్నాడు ప్రసాద్ డైనింగ్ హాల్ వేపు నడుస్తూ.

ప్రసాదమంటే ఒట్టి ప్రసాదమే కాదు. ప్లేటీలో రెండు పూరీలు, బంగాళా దుంప కూర, పులిహోర, పెరుగన్నం, టమోటా పచ్చడీ, చిప్సూ, స్వీటూ. ప్రసాద్‌తో సహా నలుగురూ ఒకే బల్ల దగ్గర కూర్చుని భోజనం చేస్తున్నారు.

"ఇదేమిటే చక్కటి భోజనం పెట్టి ప్రసాదం అంటారు. ఎవరు చేస్తారివి. మనం దీనికి డబ్బులివ్వద్దూ?" అన్నారు బామ్మగారు.

"ఇవ్వక్కర్లేదు. ప్రతి శనివారం, ప్రతి ఆదివారం ఒకళ్ళో ఇద్దరో దీన్ని స్పాన్సర్ చేస్తారు. అంటే అయ్యే ఖర్చు ఇస్తారన్నమాట.

స్పాన్సరర్లు ఇళ్ళల్లో చేసి తీసుకువస్తారు లేదా ఇక్కడే ఈ కిచన్‌లో తయారు చేస్తారు. ఇక్కడ చేసినప్పుడు, కొంతమంది వాలంటీర్లు ముందుగానే వచ్చి కిచెన్‌లో సహాయం చేస్తారు. ఇదే కాదు. ఈ చుట్టూతావున్న తోటనీ చక్కటి గడ్డినీ చూశావు కదా. వాటి పోషణ. లాన్‌మోవింగ్‌లాటి సహాయాలూ శనా దివారాల్లో వాలంటీర్లు వచ్చి చేసి వెడుతుంటారు. వీళ్ళు యథాశక్తి శ్రమదానం చేస్తుంటే, సమయం దొరకని కొంతమంది ధర్మారావులు ధనసహాయం మాత్రమే చేస్తుంటారు. ఇక్కడ ఎలెక్ట్రికల్ సిస్టమ్‌కీ సౌండ్ సిస్టమ్‌కీ సహాయం చేసింది మన పేటనించి మేమూ, మూడో ఇల్లు మందాకినీ వారి చెల్లెలు, పక్కపేటనించీ పరంధామయ్యగారూ, వారి అమెరికన్ భార్య ఆలిసన్" నవ్వుతూ అంటున్న భామని

వింతగా చూసింది బామ్మగారు. ప్రసాద్‌ని అడిగింది భామ, "కల్యాణ మండపం కట్టడం గురించి ఏమయింది?" అని.

"కడదామనే అనుకుంటున్నాం. అరవై డెబ్భయ్ ఎనభైలలో అమెరికా వచ్చిన మనవాళ్ళ పిల్లలు ఇప్పుడు పెళ్ళిళ్ళకి సిద్ధంగావున్నారు. వాళ్ళు అమెరికన్లని పెళ్ళిచేసుకున్నా, మనవాళ్ళనే పెళ్ళి చేసుకున్నా పెళ్ళి చేయటానికో ప్రదేశం కావాలి. మనవేపు గుళ్ళోపెళ్ళి అంటామే, అలా ఇక్కడ గుళ్ళోనే పెళ్ళిబాగుంటుంది. అందుకని ఒక హాలు కట్టాలని. ఇటు పెళ్ళిళ్ళకీ, అటు సాంస్కృతిక కార్యక్రమాలకీ అన్నిటికీ సరిపోతుంది. ఫండ్ రైజింగ్ చేస్తున్నాం.మీరూ యధాశక్తి కాస్తోకూస్తో... "

"తప్పకుండాను.. " అంది భామ చిరునవ్వి, గోపాలం వేపు చూస్తూ.

"పూజారిగారిని రేపు వాళ్ళ వూరు తీసుకుపెళ్ళటానికి కొలంబస్‌నించీ సూర్యం వస్తాడుట. వారి నాన్నగారి ఆబ్దికానికని. అదవగానే మళ్ళీ తీసుకు వచ్చి దించుతాడు" అన్నాడు ప్రసాద్, గోపాలంతో.

"అదేమిటీ! శుభకార్యాలు చేసే పూజారే..." అంటున్న బామ్మగారితో అంది భామ. "ఇక్కడ శుభమూ అశుభమూ అనిలేవు. మొన్న మోహనరావ్‌గారి అమ్మగారు పోయినప్పుడు దహనక్రియలతోసహా ఈ పూజారే. ఇద్దరు పూజారులున్నారు కనక ఒకళ్ళు బయటి వూళ్ళకి వెడితే ఇంకొకళ్ళు ఇక్కడ. ఇబ్బంది వుండదు. అంతేకాదు మధ్యమధ్యలో ఇతర వూళ్ళకి వెళ్ళి సత్యనారాయణ వ్రతాలు ఒకేసారి పది పన్నెండుగురు దంపతులతో సామూహికంగా చేస్తుంటారుకూడాను"

"బాగానే వుంది. ఇంత దూరం వచ్చి మన పద్ధతులన్నీ మరచిపోయారేమో అనుకుంటున్నాను" అంది తృప్తిగా బామ్మగారు.

గోపాలం మనసులో అనుకున్నాడు. ఎలా మరిచిపోతాం. మంచితో పాటు చెడూ అంతే. మనతోనే వుంటుంది. ఒక పెద్ద వూర్లో అయితే అస్మదీయ తస్మదీయ కులాలవారీగా, మన పురిటికంపు పోకుండా, గుళ్ళు కట్టడం కూడా మరిచిపోలేదు. కొన్నిచోట్ల పోటీ పడి, రెండు మూడు రకాల గుళ్ళు కట్టుకుని విజయం సాధించిన విజయసారధులూవున్నారు. మధ్యేమధ్యే రకరకాల బాబాలూ, స్వాములూ, సన్యాసులూ... రావటాలూ... పోవటాలూ...

దేవుడి దృష్టిలో మానవులందరూ సమానులే!

కానీ మానవుడి దృష్టిలోనే దేవుళ్ళందరూ సమానులు కారు!!

అందుకేనేమో ఈ మత రాజకీయాలూ, ఇతర రాజకీయాలు.

ఏది ఏమైనా, ఇండియాలోనే కాదు అమెరికాలో కూడా గుడి పది కాలాలపాటు పదిలమే!

* * *